# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 10-6-2023 | RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 | సంపుటి :29 | సంచిక: 234 | పేజీలు:6 | వెల: రూ.1/-


## మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును ప్రారంభించిన సీఎం కేసీఆర్



మంచిర్యాల , జూన్ 9:మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఆఫీసు ప్రారంభోత్సవానికి ముందు ఆ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి, కార్యాలయంలోకి సీఎం కేసీఆర్ ప్రవేశించారు. ఈ పార్టీ కార్యాలయాన్ని రూ. 60 లక్షలతో నిర్మించారు. పార్టీ ఆఫీసు వద్దకు చేరుకున్న కేసీఆర్‌కు మంచిర్యాల జిల్లా టీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్ రావు, జోగు రామన్న, రేఖా నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్



మంచిర్యాల , జూన్ 9:వమంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీవోసీ)ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ శిలాఫలకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. నూతన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కేసీఆర్ పాల్గొన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని కేసీఆర్ స్వీకరించారు.

రూ. 1,748 కోట్లతో చెన్నూర్, పర్థాన్‌పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు, రూ. 510 కోట్లతో మెడికల్ కాలేజీ, రూ. 500 కోట్లతో మందమర్రి దగ్గర ఏర్పాటు చేయనున్న ఆయిల్ పాం ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు, గోదావరిపై రూ. 164 కోట్లతో నిర్మించే మంచిర్యాల- అంతర్గాం బ్రిడ్జికి కేసీఆర్ శంకుస్థాపన చేశారు.

కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మంత్రులు ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, జోగు రామన్న, రేఖా నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పసికూన అయిన పది సంవత్సరాల తెలంగాణ.. మిగతా రాష్ట్రాలతో పోటీ పడుతోంది : సీఎం కేసీఆర్




మంచిర్యాల , జూన్ 9:పసికూన అయిన పది సంవత్సరాల తెలంగాణ.. మిగతా రాష్ట్రాలతో పోటీ పడుతోంది అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న తెలంగాణ.. కేంద్రం నుంచి అనేక అవార్డులను అందుకుందని కేసీఆర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభించుకున్న అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు.

ఈ రోజు మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మనందరం చేసిన పోరాటంతో తెలంగాణ సాధించుకున్నాం. పరిపాలన సంస్కరణల కోసం నూతన కలెక్టరేట్‌లను నిర్మించుకున్నాం. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. మంచిర్యాల జిల్లా డిమాండ్ ఎప్పట్నుంచో ఉంది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది కాబట్టే మంచిర్యాలను జిల్లాగా ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలకు మంచి జరగాలనే కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం.

ఆసిఫాబాద్ కలెక్టరేట్‌ను కూడా త్వరలోనే ప్రారంభించుకోబోతున్నాం. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ టాప్‌లో ఉందన్నారు. ప్రజలకు వారధిగా ఉద్యోగులు పని చేయడంతో, మంచి ఫలితాలను సాధించాం. తెలంగాణ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉంది. అనేక రికార్డులను నెలకొల్పాం. కరోనా, నోట్ల రద్దు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. కష్టకాలంలోనూ తెలంగాణ అభివృద్ధిలో ముందుంది. కులమతాలకు అతీతంగా అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేస్తున్న అధికారులకు అభినందనలు. కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని, రెండో విడుత గొర్రెల పంపిణీ పథకాన్ని మంచిర్యాల నుంచే ప్రారంభించుకోబోతున్నాం. గొర్రెల పెంపకంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. మానవీయ కోణంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఆరోగ్య శాఖ బ్రహ్మాండమైన పురోగతి సాధించింది. మాతాశిశు మరణాలు తగ్గాయి. కంటి వెలుగు లాంటి పథకం దేశంలో ఎక్కడా లేదు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ఢిల్లీ, పంజాబ్‌లో కూడా ఆ ముఖ్యమంత్రులు కూడా అమలు చేశారని సీఎం కేసీఆర్ తెలిపారు.

## కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్




మంచిర్యాల , జూన్ 9: రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు పథకాలను ప్రారంభించింది. నూతన పథకాలైన గృహలక్ష్మి, కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాలతో పాటు రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని మంచిర్యాల జిల్లా వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా గృహలక్ష్మి, బీసీ కులాల్లోని కులవృత్తుల లబ్దిదారులకు కేసీఆర్ ఆర్థిక సాయాన్ని అందించారు. రెండో విడుత గొర్రెల పంపిణీ కింద లబ్దిదారులకు కేసీఆర్ గొర్రెలను పంపిణీ చేశారు. గృహలక్ష్మి, కులవృత్తుల వారు, గొర్రెల లబ్దిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చెన్నయ్య, జోగు రామన్న, దివాకర్ రావు, రేఖా నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే : గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ, జూన్ 9:కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిగా మారుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సంక్షేమ సంబురాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

కాంగ్రెస్ నేతలుఅధికారం కోసం అర్రులు చాస్తున్నారని, ఆ పార్టీకి అధికారమిస్తే సంక్షేమ పథకాలకు ముగింపు పలుకడం ఖాయమని అన్నారు. నెత్తికి రుమాలు కట్టుకుని ఓ కాంగ్రెస్ నేత అధికారం వస్తే దోచుకుందామని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో 11 మంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారని, అందులో నల్లగొండ జిల్లా నుంచే ముగ్గురు ఉన్నారని విమర్శించారు.ఆ పార్టీకి నాయకత్వమే లేదని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు. తాను గత ప్రభుత్వాల్లోనూ పని చేశానని, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్(అఓ ఐలఖీ) అని తెలిపారు. అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం కల్పించడంతోపాటు ప్రజల మేలు కోసం తపిస్తున్న




కేసీఆర్‌కు అండగా నిలువాలని కోరారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బీసీలకు రుణసాయం, కులాంతర వివాహ లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేం దర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులకు ఆర్థిక తోడ్పాటు : మంత్రి వేముల




నిజామాబాద్, జూన్ 9: తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులకు ఆర్థికంగా తోడ్పాటునందించే కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండలో జరిగిన సంక్షేమ సంబురాల్లో పాల్గొని గొల్ల కురమలకు రెండో విడుత గొర్రెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేసీఆర్‌కంటే గొప్పగా ఎవరూ ఆలోచన చేయలేరని స్పష్టం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఇస్తున్న పెన్షన్ 750 మాత్రమే. అదే ఉత్తరప్రదేశ్‌లో 500 మాత్రమే అని చెప్పారు. గుజరాత్‌లో పెన్షన్ల కోసం నెలకు 100 కోట్లు ఖర్చు చేస్తుంటే, కేసీఆర్ తెలంగాణలో ప్రతి నెలా 1000 కోట్లు ఖర్చు చేస్తున్నారని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించే బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేదల కోసం చేస్తున్నది ఏమీ లేదని మండిపడ్డారు.

దేవుడి పేరు, దేశం పేరు మీద మహిళలను, యువకులను మభ్యపెట్టే పనులకు పూనుకున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులవృత్తుల వారికి లక్ష రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.

## గవర్నర్ చేతులు మీదుగా స్వచ్ఛంద రక్తదాత అవార్డు

వికారాబాద్ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);:- ప్రపంచ రక్త దాతల దినోత్సవ సందర్భంగా జూన్ 14వ తేదీ బుధవారం నాడు రాజ్ భవన్ యందు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్ రాజన్ చేతులు మీదుగా వికారాబాద్ జిల్లా నుండి స్వచ్ఛంద రక్తదాత అవార్డును సత్యనారాయణ గౌడ్ అందుకోబోతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి జిల్లాకు ఒకరికి స్వచ్ఛంద రక్తదాత అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గారి చేతుల మీదుగా ఇవ్వటం జరుగుతుంది.

ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు అవార్డుకి ఎంపికైనటువంటి సత్యనారాయణ గౌడ్ గారిని అభినందించారు.

## ఆస్ట్రేలియాలో జరిగే కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్, జూన్ 9: ఆస్ట్రేలియాలో నిర్వహించనున్న కేసీఆర్ క్రికెట్ కప్‌టోర్నమెంట్ పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి లక్ష్యాలను, ముఖ్యమంత్రి కేసీఆర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా టోర్నీని నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డిని ఆమె అభినందించారు.

టోర్నమెంట్ నిర్వహణ వల్ల సీఎం కేసీఆర్ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే ఎజెండా ను ఎన్ఆర్ఐ లందరికీ చేరుతుందని ఆమె పేర్కొన్నారు. నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రతీ గ్రామానికి స్టేడియం నిర్మించనున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావాన్ని భారతీయులకు, ఎన్ఆర్ఐలకు తెలిసేలా క్రికెట్ టోర్నీని ఎంచుకున్నామని వివరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బాబా ఫసియుద్దీన్ ,సేనాపతి రాజు, కల్లెం హరికృష్ణ రెడ్డి, రమేష్ చారి, బీ ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఈ సారి మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్




న్యూ డిల్లీ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఫ్యాషన్ ప్రియులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే మిస్ వరల్డ్ పోటీలకు ఈ సారి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఈ పోటీలు భారత్‌లో జరగబోతున్నాయి. తుది తేదీలు ఇంకా ఖరారు కానప్పటికీ.. 71వ మిస్ వరల్డ్ పోటీలు నవంబర్‌లో నిర్వహించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్ పర్సన్, సీఈవో జూలియా మోర్లీ వెల్లడించారు.'ఈ ఏడాది నవంబర్‌లో 71వ ప్రపంచ సుందరి పోటీలు ఇండియాలో జరగబోతున్నాయని ప్రకటించడానికి ఎంతో సంతోషిస్తున్నా. ఎన్నో ప్రత్యేకతలు, విభిన్న సంస్కృతులకు నిలయంగా ఉన్న భారత్‌లో ఈ పోటీలు నిర్వహించేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని జూలియా వెల్లడించారు. దాదాపు నెల రోజుల పాటు సాగే ఈ ప్రపంచ సుందరి పోటీల్లో 130కిపైగా దేశాల నుంచి అభ్యర్థులు పాల్గొంటారు.భారత్‌లో చివరిగా 1996లో మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు మన దేశంలో ప్రపంచ సుందరి పోటీలు జరగనుండటం విశేషం. కాగా, భారత్ ఇప్పటి వరకూ ఆరుసార్లు మిస్ వరల్డ్ కిరీటాన్ని దక్కించుకుంది. 1966 ఏడాదిలో రీటా ఫరియా మొదటి సారి భారత్ నుంచి మిస్ వరల్డ్ కిరీటాన్ని అందుకుంది. ఆ తర్వాత ఐశ్వర్యా రాయ్ బచ్చన్ (1994), డయానా హైడెన్ (1997), యుక్తాముఖి (1999), ప్రియాంక చోప్రా(2000), మానుషి చిల్లర్ (2017) విశ్వ సుందరి కిరీటాలను దక్కించుకున్నారు.

## వికలాంగులకు కేసీఆర్ గుడ్ న్యూస్.. పెన్షన్ ఇక రూ. 4,116

మంచిర్యాల , జూన్ 9: రాష్ట్రంలోని వికలాంగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. తెలంగాణలోని వికలాంగులకు ఆసరా పెన్షన్లు పెంచుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. పెంచిన పెన్షన్లు వచ్చే నెల నుంచి అమల్లోకి వస్తాయని కేసీఆర్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రగతి నివేదన సభలో కేసీఆర్ మాట్లాడారు.

మొత్తం తెలంగాణ సమాజం బాగుండాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. ముసలమ్మలు, ముసలి తాతలు ఆసరా పెన్షన్లతో బ్రహ్మాండంగా ఉన్నారు. వికలాంగులకు రూ. 3,116 పెన్షన్ ఇస్తున్నాం. ఇవాళ మంచిదినం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో వికలాంగుల పెన్షన్ కూడా పెంచబోతున్నాం. మరో వెయ్యి రూపాయాలు పెంచుతున్నాం. మంచిర్యాల గడ్డ నుంచి తెలంగాణ ఈశాన్య ప్రాంతం నుంచి ప్రకటించాలని నేను సస్పెన్షన్‌లో పెట్టాను. వచ్చే నెల నుంచి రూ. 4,116 పెన్షన్ అందుతుంది. అందరి సంక్షేమాన్ని, మంచిని చూసుకుంటున్నాం అని కేసీఆర్ తెలిపారు.

### నేటి కందం- నేటికి అందం

కం॥ ఇమ్మహి కానందమును నిజు
బొమ్మలను తయారు జేయు పూబాలుర్కలకున్
బొమ్మల దినోత్సవమ్మున
లెమ్మికనులకేజు సంపదలనందించున్ !!



-రాధశ్రీ

(10-6-1934 ప్రపంచ బొమ్మల దినోత్సవం...)

సెల్:9494481210

## సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, జూన్ 9:ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని మంత్రి హరీశ్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అత్తా కోడళ్ల పంచాయితీలు బందయ్యాయని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు ఆత్మగౌరవం పెంచారని తెలిపారు. గాంధీ భవన్‌లో కూర్చుంటే కాంగ్రెస్ వాళ్లకు అర్థంకాదని, ఊర్లోకి వచ్చి అవ్వ, తాతలను అడిగితే తెలుస్తుందన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సిద్దిపేటలో నిర్వహించిన సంక్షేమ ఉత్సవాలకు మంత్రి హరీశ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో తప్పా బీడీ కార్మికులకు ఏ రాష్ట్రంలోనైనా పెన్షన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచారని చెప్పారు. పెద్ద కొడుకులా వృద్ధులకు పెన్షన్లు అందిస్తున్నారని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింట్లో వెలుగులు నిండాయన్నారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు 12 లక్షల 71 వేల మంది ఆడబిడ్డలకు మేనమామలా పెండ్లి చేశారని తెలిపారు. తొమ్మిదేండ్లలో ఆసరా పెన్షన్ల కింద 59 వేల కోట్లు అందించామన్నారు. అన్ని కులాలకు సంక్షేమ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రెండు, మూడు రోజులకు ఒకసారి మంచి నీళ్లు వచ్చేవి, ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సురక్షిత మంచి నీళ్లు ఇస్తున్నామని వెల్లడించారు. నేరుగా పొయ్యి దగ్గరకే తాగునీరు వస్తున్నదని స్పష్టం చేశారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా సిద్దిపేట..

సిద్దిపేటలో 12 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుచేశామన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ ఏర్పడిందన్నారు. సిద్దిపేటను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని వెల్లడించారు. పట్టణంలోని కోమటి చెరువు సర్వాంగ సుందరంగా తయారైందని, చెరువ వద్ద త్వరలో డైనోసర్ పార్క్‌ను ఏర్పాటుచేస్తామన్నారు.

బండి సంజయ్ కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చాడా?



ప్రభుత్వ దవాఖానల్లో 33 వేల పడకలు ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. తొమ్మిదేండ్లలో 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేశామని తెలిపారు. వైద్య కళాశాలలు తెచ్చామని బీజేపీ నాయకులు అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకుల తీరు సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిది అన్నట్లు ఉందని విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చాడా అని ప్రశ్నించారు. అబద్ధాల బీజేపీ నాయకులు బేషరతుగా క్షమాపణలు చేప్పాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలను అమలు చేయాలన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలని వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులవి నరం లేని నాలుకలని విమర్శించారు.

## కాంగ్రెస్ నేతలు 'టూరిస్టులు'.. ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు 'టూరిస్టులు' అని చురకలంటించారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవాలను ఎప్పటికీ పట్టించుకోదని విమర్శించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వ పరిపాలన మోడల్‌ని.. ఏ పార్టీకి విమర్శించే నైతికత లేదని పేర్కొన్నారు. తెలంగాణ పథకాలు, మౌలిక సదుపాయాలను ప్రతి పౌరుడు, "టూరిస్టులు" ప్రశంసించారన్నారని కవిత తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, కవితతో పాటు బీఆర్ఎస్ నేతలు బీజేపీ నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు తెలంగాణలో పరిస్థితి మారి పోయింది. ఇప్పుడు బీజేపీని వదిలి కాంగ్రెస్‌నే గులాబీ పార్టీ నేతలు టార్గెట్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్ ఎప్పుడు మీడియా ముందుకొచ్చినా.. బహిరంగ సభలో మాట్లాడినా మాటకు ముందు.. వెనుక బీజేపీని దుమ్మెత్తి పోస్తుండేవారు. కేంద్రంలోని బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చేశారు. బీజేపీని విమర్శించడానికి ఏ చిన్న చాన్స్ వచ్చినా సరే అస్సలు వదులుకోరు. కానీ ఇప్పుడు సీన్ మారినట్లు కనిపిస్తోంది.

# డిజిటల్ యుగపు యువత నిర్మాణం కావాలి..!

రాతి, లోహ, స్టీల్, కాంక్రీట్, కంప్యూటర్, నానో, సిలికాన్, గ్రాఫీన్ యుగాలు దాటుతూ మానవ చరిత్ర సమూల మార్పులకు లోనవుతూ జీవనశైలిని దశల వారీగా మారుతూ వస్తున్నది. నాటి హరిత, పారిశ్రామిక విప్లవాల అనంతరం కంప్యూటర్ యుగం, స్మార్ట్‌ఫోన్ విప్లవం దాటుతూ నేడు పారిశ్రామిక విప్లవం 4.0 దశగుండా ప్రపంచ మానవాళి వేగంగా నడుస్తున్నది. మానవ మేధతో స్మార్ట్ వ్యవస్థల అనుసంధానంతో నేటి ప్రపంచం 4వ పారిశ్రామిక విప్లవ (ఇండస్ట్రీ 4.0) సునామీలో కొట్టుకుపోతున్నది. నేటి డిజిటల్ యుగంలో మానవుడితో యంత్ర సమన్వయం హద్దులు దాటి అంతర్జాల ఇంధనంతో ఊగి పోతున్నాడు. నేటి పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా యువతకు శాస్త్రసాంకేతిక విద్యా బోధనలు కనీస అవసరాలు అయ్యాయి.

### ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు ఒంట పట్టించుకోవడం:

దేశవ్యాప్తంగా సాంకేతిక సంస్థల్లో డిమాండ్ కలిగిన 9 సాంకేతిక సబ్జెక్టులను గుర్తించి సెలబస్‌లో సమూల మార్పులతో యువతను సాంకేతిక నైపుణ్య నిధులుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బాటలు వేస్తున్నది. ఈ పాఠ్యాంశాల సమూల మార్పులతో ఇండస్ట్రీ కోరుకునే సాంకేతిక నైపుణ్య భారతీయ యువ మానవ వనరులను అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అభివృద్ధి చేయడానికి "ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఈ)"తో కలిసి "నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రేనింగ్ అండ్ రిసెర్చ్ (యన్ఐటిటిటిఆర్)" పావులు కదుపుతున్నది. పారిశ్రామిక నిపుణులు, ఆర్ అండ్ డి నిపుణులు, అకడమిషియన్లతో ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ సరి కొత్త ఇంజనీరింగ్ పాఠ్యాంశాలను సిఫార్సు చేసింది. స్వయం(యస్‌డబ్ల్యూఏవైఏయం), మూక్స్ (యంఓఓసియస్) ఆధారంగా నూతన సెలబస్ రానుంది. సెలబస్‌లో చేర్చేందుకు సిఫార్సు చేసిన తొమ్మిది ఎమర్జింగ్ సబ్జెక్ట్స్ వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

1. కృత్రిమ మేధ (ఆర్టిఫీషిల్ ఇంటెలిజెన్స్):

పైథాన్‌లో బేసిక్ ప్రోగ్రామింగ్, డాటా స్ట్రక్చర్స్ పునాదుల మీద కృత్రిమ మేధ నిర్మాణం జరుగుతోంది. కృత్రిమ మేధతో పరిశ్రమలు, రక్షణశాఖ, వైద్య ఆరోగ్య రంగం, వ్యవసాయరంగం లాంటి అనేక రంగాలు ప్రధాన అనువర్తనాలను కలిగి ఉన్నాయి. ఇంజనీరింగ్ డిగ్రీలో కృత్రిమ మేధ కర్రికులమ్ ప్రవేశ పెడుతున్నారు. అల్గారిథమ్స్ సెర్చ్, ప్రాబబైలిస్టిక్ రీజనింగ్, మార్కోవ్ డెసిషన్ ప్రాసెస్, రీఇన్ఫోర్స్‌మెంట్ లెర్నింగ్ లాంటి అంశాలతో పాటు సంబంధ ప్రాక్టికల్స్ కోర్సులో భాగం కానున్నాయి.

2. ఐఓటి (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్):

సెన్సర్స్, సిస్టమ్ ఇంటిగ్రేషన్, క్లౌడ్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీల పునాదుల మీద ఐఓటి మానవ నైపుణ్యాలను నిర్మించనున్నారు. ఐఓటి అవగాహన, హార్డ్ అండ్ సాఫ్ట్‌వేర్ కాంపొనెంట్స్, సెన్సార్స్ అండ్ కమ్యూనికేషన్ మాడ్యూల్స్, రిమోట్ మానిటరింగ్, ఐఓటి ఆధారిత ప్రాజెక్టులు సెలబస్‌లో సింహభాగం కానున్నాయి. ఎలిమెంట్స్ ఆఫ్ ఐఓటి, ఐఓటి అనువర్తనాలు, ఐఓటి కేస్ అధ్యయనాలతో పాటు అవసర ప్రాక్టికల్స్ కోర్సులో చేర్చబడ్డాయి.

3. బ్లాక్ చైన్:

క్రిప్టోగ్రఫీ టెక్నిక్స్, డాటా స్ట్రక్చర్స్, అల్గోరిథమ్స్, ప్రోగ్రామింగ్స్ పునాదుల మీద బ్లాక్ చైన్ టెక్నాలజీస్ నిర్మించనున్నారు. అండర్‌స్టాండింగ్ బ్లాక్ చైన్ మిత్ క్రిప్టో కరెన్సీ, క్రిప్టో ప్రిమిటివ్స్, బ్లాక్ చైన్ అనువర్తనాలు, తగు ప్రాక్టికల్స్ సెలబస్‌లో చేర్చబడ్డాయి.

4. రోబోటిక్స్:

ఇంజనీరింగ్ మ్యాథ్స్, ఆటోమేషన్ అండ్ కంట్రోల్ పునాదుల మీద ఇండస్ట్రియల్ రోరోటిక్స్ మీద దృష్టి పెట్టనున్నారు. రోబోట్ కైనమాటిక్స్ అండ్ డైనమిక్స్, సెన్సార్స్ అండ్ విజన్ సిస్టమ్స్, రోబోట్ కంట్రోల్, రోబోట్ అక్చుయేషన్ సిస్టమ్స్, కంట్రోల్ హార్డ్‌వేర్ అండ్ ఇంటర్‌ఫేసింగ్, తగు ప్లాంరాక్టిటికల్స్‌కు సంబంధించిన అంశాలు కర్రికులమ్‌లో చేరనున్నాయి.

5. క్వాంటమ్ కంప్యూటింగ్:

డాటా స్ట్రక్చర్ అండ్ అల్గోరిథమ్స్, పైథాన్ ప్రోగ్రామింగ్/సి+ ఆధారంగా మ్యాథ్ ఫౌండేషన్ ఫర్ క్వాంటం కంప్యూటింగ్, బిల్డింగ్ బ్లాక్స్ ఫర్ క్వాంటం ప్రోగ్రామ్, క్వాంటం అల్గోరిథమ్స్, అవసర ప్రాక్టికల్స్ సిలబస్‌గా కోర్సులు రానున్నాయి.

6. డాటా సైన్స్:

ప్రోగ్రామింగ్ ఉపోద్ఘాతం, ప్రాబబులిటీల పునాదులుగా డాటా సైన్స్, ప్రోగ్రామింగ్ టూల్స్ ఫర్ డాటా సైన్స్, మ్యాథ్స్ పౌండేషన్స్, మెషిన్ లెర్నింగ్, కేస్ స్టడీస్, తగు ప్రాక్టికల్స్ సిలబస్‌లో భాగం కానున్నాయి.

7. సైబర్ సెక్యూరిటీస్:

కంప్యూటర్లు, నెట్‌వర్కింగ్, ఇంటర్నెట్ లాంటి అంశాల్లో మౌళిక పరిజ్ఞానం, విండో ఆపరేటింగ్ సిస్టమ్స్ ఆధారంగా సైబర్ సెక్యూరిటీ కాన్సెప్ట్స్, క్రిప్టోగ్రఫీ అండ్ క్రిప్టనాలిసిస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ వల్నరబులిటీస్ అండ్ సేఫ్ గార్డ్స్, మాల్వేర్, సైబర్ లా అండ్ ఫొరెన్సిక్స్, సెక్యూరిటీ టెక్నాలజీ లాంటి అంశాలతో పాటు సంబంధిత ప్రాక్టికల్స్ పాఠ్యాంశాలుగా చేర్చబడుతున్నాయి.

8. 3డి ప్రింటింగ్ అండ్ డిజైన్:

కంప్యూటర్ ఏయిడెడ్ డిజైన్, ఇంజనీరింగ్ మెటీరియల్స్ పునాదులుగా 3డి ప్రింటింగ్, కాడ్, అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నిక్స్ అండ్ ఎక్విప్‌మెంట్స్, మెటీరియల్స్, పోస్ట్ ప్రాసెసింగ్, ప్రాడక్ట్ క్వాలిటీ, తగు ప్రాక్టికల్స్‌తో కోర్సు ప్రారంభం అవుతున్నది.

9. వర్చువల్ రియాలిటీ (విఆర్):

సి++ మౌళిక పరిజ్ఞానం ఆధారంగా వర్చువల్ రియాలిటీ, లర్చువల్ ఎన్విరాన్‌మెంట్, 3డి కంప్యూటర్ గ్రాఫిక్స్, జియొమెట్రిక్ మాడలింగ్, విఆర్ హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్, విఆర్ అనువర్తనాలు, సరైన ప్రాక్టికల్స్‌తో కూడిన ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెడుతున్నారు.

### డిజిటల్ స్కిల్లింగ్ కోర్సులు:

గ్రాఫీన్ టెక్నాలజీ, క్వాంటమ్ టెక్నాలజీ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీలపై కనీసం కోటి మంది యూనివర్సిటీ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ముదావహం. డిజిటల్ స్కిల్లింగ్ పేరిట మన విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచి పోషించి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు చేర్చి ప్రపంచవ్యాప్త బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలకు అర్హతలు కల్పించనున్నారు. రాబోయే రెండు మూడు దశాబ్దాల పాటు డిమాండ్ ఉండే వర్ధమాన సాంకేతిక కోర్సులను రూపొందించడం, స్వల్పకాలిక కోర్సులను 6 మాసాల్లోపు పూర్తి చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ సాంకేతిక కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఇంటర్న్‌షిప్/అప్రెంటిషిప్‌లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఎమర్జింగ్ టెక్నాలజీల్లో మౌళిక అంశాలను బోధించడం, డిగ్రీ చేసిన వారికి పూర్తి స్థాయిలో అత్యాధునిక నైపుణ్యాలు బోధించడం జరుగుతుంది. ఈ కోర్సులను నిర్వహించడానికి మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబియం లాంటి 200లకు పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలు సంసిద్ధతను వ్యక్తం చేయడం హర్షదాయకం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# 'కులగణన' కేంద్రమే చేయాలి - సిఫారసు చేయండి

**– జాతీయ బీసీ కమిషన్ ఛైర్మన్ హన్సరాజ్ ను కలిసిన రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం**




న్యూఢిల్లీ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్ల శాతం, జాబితాల పునర్విభజన, మార్పులు, చేర్పులను శాస్త్రీయంగా నిర్ణయించడానికి తదనుగుణంగా చర్యలు తీసుకోవడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ' కులగణన' చేపట్టాలని కోరుతూ జాతీయ బీసీ కమిషన్ సిఫారసు చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు కోరారు. గురువారంనాడు న్యూఢిల్లీలో బికాజీ కామ ప్లేస్, త్రికూట్-1 లో గల జాతీయ బీసీ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ హన్సరాజ్ గంగారాం అహీర్ తో డా॥ వకుళాభరణం ప్రత్యేకంగా భేటి అయ్యారు. పలు అంశాల వారిగా కూలంకశంగా చర్చించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందచేశారు. తొలిసారిగా కలిసిన ఈ నేపథ్యంలో ఇరువురు ఛైర్మన్లు ఒకరిని ఒకరు అభినందించుకున్నారు. పుష్పగుచ్ఛాలు అందచేసుకున్నారు. శాలువాలతో సత్కరించుకున్నారు.

# రెండో ఘాట్ రోడ్డులో ప్రమాదం.. కొండని ఢీ కొన్న టెంపో

తిరుపతి, జూన్ 9:తిరుమల రెండో ఘాట్ రోడ్డులో తిరుపతి నుంచి తిరుమల వెళ్తోన్న ఓ టెంపో వాహనం కొండని ఢీ కొట్టింది. డ్రైవర్ బస్సును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఈ ఘటన జరిగింది. సేఫ్టీ వాల్, రెయిలింగ్ లేకపోవడంతో టెంపో నేరుగా కొండను తాకింది. ప్రమాద సమయంలో టెంపోలో డ్రైవర్ తప్ప ఎవరూ లేరు. కొండను ఢీకొట్టిన నేపథ్యంలో టెంపో ముందుభాగం ధ్వంసమైంది. వరుస ప్రమాదాలపై టీటీడీ పాలకవర్గం సమీక్ష చేపట్టి, సూచనలు చేసిన వారంలోపే ఘటన జరగడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో తిరుమల ఘాట్ రోడ్లపై వరుసగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడు వారాల వ్యవధిలో నాలుగో ప్రమాదం చోటుచేసుకుంది.

# మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చాం- పేర్ని నాని

అమరావతి, జూన్ 9:సీఎం జగన్ అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచారని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారని మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. ఏ ఉద్యోగి రోడ్డు ఎక్కకుండానే 12వ పీఆర్సీని సీఎం జగన్ ప్రకటించారని పేర్ని నాని తెలిపారు. చంద్రబాబు ఏ రోజూ మేనిఫెస్టోను పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను టీడీపీ పట్టించుకలేదని వెల్లడించారు. చంద్రబాబు కుమారుడికి భద్రత కరువైందని గవర్నర్ కు ఫిర్యాదు చేశారన్న ఆయన మాజీ సీఎం కుమారుడికి ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ భద్రతే కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

పాదయాత్ర చేస్తోన్న నారా లోకేష్ ప్రజా ప్రతినిధి కూడా కాదు.. చంద్రబాబు కుమారుడికి భద్రత కరవైందని గవర్నర్ కు ఫిర్యాదు చేశారని ఎద్దేవా చేశారు పేర్ని నాని.. నోటికొచ్చినట్లుగా భద్రతా సిబ్బందిని లోకేష్ మాట్లాడుతున్నారు.. మాజీ ముఖ్యమంత్రి కుమారుడికి ఇవ్వాల్సినంత దానికంటే ఎక్కువగానే భద్రతను ప్రభుత్వం ఇచ్చిందని స్పష్టం చేశారు..

# జమ్ముకశ్మీర్ ఎన్‌హెచ్-44పై ఉన్న ఉధంపూర్-రాంబన్ సెక్షన్‌లో చీనాబ్ నదిపై 2-వరుసల జైస్వాల్ వంతెన నిర్మాణం పూర్తయిందని వెల్లడించిన శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 9:జమ్ముకశ్మీర్ ఎన్‌హెచ్-44పై ఉన్న ఉధంపూర్-రాంబన్ సెక్షన్‌లో చీనాబ్ నదిపై 2-వరుసల జైస్వాల్ వంతెన నిర్మాణం పూర్తయిందని కేంద్ర రోడ్డు రవాణా ఉ జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ బ్యాలెన్స్‌డ్ కాంటిలివర్ బ్రిడ్జిని 118 మీటర్ల పొడవుతో ?20 కోట్లతో నిర్మించామని ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

ఈ వంతెన రెండు విధాలా ప్రయోజనకారిగా ఉంటుందని శ్రీ గడ్కరీ అన్నారు. మొదటిది, చందర్‌కోట్ నుంచి రాంబన్ సెక్షన్ వరకు రద్దీని తగ్గిస్తుంది, వాహనాల రాకపోకలు మరింత సులభంగా మారతాయి. రెండోది, త్వరలో ప్రారంభం కానున్న జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి 44పై, 'అమర్‌నాథ్ యాత్ర' సమయంలో వాహనాలు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తుంది. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, జమ్ముకశ్మీర్‌లో అద్భుతమైన జాతీయ రహదారి మౌలిక సదుపాయాలు కల్పించాలన్న నిబద్ధతతో పని చేస్తున్నట్లు శ్రీ గడ్కరీ చెప్పారు. ఈ అభివృద్ధి ఈ ప్రాంత ఆర్థిక వృద్ధికి దోహదపడటమే కాకుండా, ప్రధాన పర్యాటక కేంద్రంగా ఆకర్షణను పెంచుతుందని అన్నారు.

# అమృత కాల యువత పాత్రపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మేటా

న్యూఢిల్లీ, జూన్ 8:నవ భారతదేశం కలల సాకారం: అమృత కాల యువత పాత్ర అనే అంశంపై మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మేటా చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి స్మృతి జుబిన్ ఇరానీ ఈరోజు ప్రారంభించారు. భవిష్యత్తుపై 16-18 సంవత్సరాల వయస్సు గల యువత తమ ఆకాంక్షలను వెల్లడించి కలలు సాకారం చేసుకునేలా వారిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. యువతకు సాధికారత కల్పించి నవ భారత నిర్మాణంలో వారికి సముచిత పాత్ర కల్పించడం లక్ష్యంగా అమృత కాల యువత కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో సృజనాత్మకతతో వారి ఆకాంక్షలు, లక్ష్యాలను ప్రదర్శిస్తారు. దేశం అన్ని ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు పాల్గొనేలా చూసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆశయాలను సాధించడం, పెద్దయ్యాక వారు ఏమి కావాలని కోరుకుంటారు అన్న అంశాలకు ప్రచారంలో ప్రాధాన్యత ఇస్తారు.

ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి శ్రీమతి స్మృతీ జుబిన్ ఇరానీ "మన యువత రేపటి భారతదేశానికి రూపశిల్పులు. వారి ఆకాంక్షలను గుర్తించడం, ప్రోత్సహించడం, ఆకాంక్షలు నెరవేరేలా అమృత్ తరం ప్రచారం సాగుతుంది. కలలను సాకారం చేసుకోవడానికి యువతకు ప్రోత్సాహం అవసరం. మెటా ఇండియా సహకారంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ దిశలో చర్యలు అమలు చేస్తుంది" అని అన్నారు.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో అమలు చేయనున్న కార్యక్రమం పట్ల మెటా ఇండియా పాలసీ ప్రోగ్రామ్‌లు, ప్రభుత్వ ఔట్‌రీచ్- హెడ్, నటాషా జోగ్ హర్షం వ్యక్తం చేశారు. "యువత ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్‌లో తమను తాము వ్యక్తీకరించడంలో సహాయపడటానికి మెటా ఇండియా సిద్ధంగా ఉంది. దీనిలో భాగంగా మెటా ఇండియా, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ వినూతన కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. ఈ కార్యక్రమం ద్వారా నవ భారతదేశం గురించి యువత కంటున్న కలలు దృశ్యమానంగా తీర్చి దిద్దుతారు. కార్యక్రమం ద్వారా యువ నాయకులు సిద్ధం అవుతారు" అని నటాషా జోగ్ అన్నారు.

" తమ కలలను, ఆకాంక్షలను పంచుకోవడానికి యువతకు అమృత్ జనరేషన్ ప్రచారం ఒక అసాధారణమైన వేదికగా ఉంటుంది. భావి తరానికి శక్తి సామర్థ్యాలు సమకూర్చడానికి మెటా ఇండియా కృషి చేస్తోంది. భవిష్యత్తు కోసం యువత ఆశ , ఆశయాన్ని కలిగి ఉండాలని మెటా ఇండియా ఆశిస్తోంది. దీనికి అవసరమైన సహకారాన్ని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో అందిస్తాం." అని ఆయన అన్నారు.

అమృత్ జనరేషన్ ప్రచారంలో పాల్గొనడానికి ఇన్‌స్టాగ్రామ్ లేదా ఫేస్‌బుక్‌లో హ్యాష్‌ట్యాగ్ (ఛ) అమృత్ జనరేషన్‌ని ఉపయోగించి వారి ఆకాంక్షలను ప్రదర్శించే రీల్ సృష్టించాల్సి ఉంటుంది. . అర్హత ప్రమాణాలు, సమర్పణ మార్గదర్శకాలతో సహా మరిన్ని వివరాలను ఈజీఇవఎనీనీని ఉఖం పేజీ ,కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో చూడవచ్చు. ప్రచార కార్యక్రమంలో పాల్గొనే వారి నుంచి 50 మందిని ఎంపిక చేస్తారు. ఎంపిక అయిన వారు ఢిల్లీలో సీనియర్ విధాన రూపకర్తలు, పరిశ్రమ వర్గాలు చెందిన సీనియర్ ప్రతినిధులతో చర్చలు జరపడానికి అవకాశం పొందుతారు. సంబంధిత రంగాలపై విలువైన సమాచారాన్ని అందించి కలలను సాకారం చేసుకోవడానికి ఎంపిక అయిన వారు ప్రత్యేక అవకాశం పొందుతారు.

ఎంపికైన యువ భారతీయులు గురుగ్రం లోని మెటా కార్యాలయాన్ని సందర్శించి, సృజనాత్మక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి నిపుణుల నుంచి సలహాలు సూచనలు పొందుతారు. వ్యక్తుల మధ్య సంబంధాలు పెంపొందించడానికి, నూతన సామాజిక వర్గాలు అభివృద్ధి చేయడానికి, వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన సాంకేతికతలను మెటా ఇండియా రూపొందిస్తుంది. 2004లో ఫేస్‌బుక్ ప్రారంభించినప్పుడు మెటా ప్రజలు మధ్య సంబంధాలు కల్పించే విధానాన్ని మార్చింది. మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి యాప్‌లు ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మందికి మెటా సహకారం అందిస్తోంది. సామాజిక సాంకేతికత లో తదుపరి పరిణామాన్ని రూపొందించడంలో సహాయపడటానికి ఓవబిజీ 2ఆ స్క్రీన్‌లను దాటి ఆగ్మెంటెడ్ మరియు వర్చువల్ రియాలిటీ వంటి అధునాతన అంశాల అభివృద్ధి పై దృష్టి సారించింది.

# బీసీ నేతలతో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ



అమరావతి, జూన్ 9:వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ బీసీ విభాగం నేతలతో సమావేశమయ్యారు. ఈరోజు తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ అనుబంధ విభాగాల ఇంఛార్జి వి.విజయసాయి రెడ్డి బీసీ నేతలతో సమావేశమయ్యారు. వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, శాసనమండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ విభాగ రాష్ట్ర జోనల్ ఇంఛార్జిలు, జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ స్థాయిల్లో బీసీ విభాగ కమిటీల నియామకంపై సమీక్షించారు. విభాగ తదుపరి కార్యాచరణపై విజయసాయిరెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ఈనెల 10న రాష్ట్రంలోని అన్ని విద్యార్థి సంఘాలతో అఖిలపక్ష సమావేశం

**– తెలంగాణ రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ,**

హైదరాబాద్, జూన్ 9:నేడు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద 10వ తేదీన విద్యార్థి అఖిలపక్ష సమావేశం విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ వేముల రామకృష్ణ, పిలుపు నిచ్చారు. ఓయు లో మీడియా సమావేశం లో ఎన్ఐఎం శ్రీకాంత్ యాదవ్, సుమంత్ పిడిఎస్యు క్రాంతి, కట్ట హరీష్, వేాడ రాందేవ్,మున్నా, ఉప్పందర్, ప్రదీప్, రాము, చరణ్ ,వంశీ, ప్రవీణ్ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు.. ఈ అఖిలపక్ష సమావేశానికి రాష్ట్రంలో అన్నీ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొంతున్నారని తెలిపారు.. ముఖ్య అతిధి జాతీయ బి.సి సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య సభను ఉద్దేశించి ప్రసంగిస్తారాణి తెలిపారు. రాష్ట్రములో 1200 మంది విద్యార్థులు అత్మబలిదానం చేసుకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కానీ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని విమర్శించారు. కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్ట్, డిజైనింగ్ ఫ్లైఓవర్, స్కై ఓవర్, సీఎం క్యాంప్ ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, కలెక్టరేట్ భవనాలు సెక్రటేరియట్ కట్టడానికి నిధులు ఉంటాయి కానీ పేద విద్యార్థులు చదువుకోడానికి నిధులు ఉండవా అని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రియంబర్స్ మెంట్ అమలు చేయక యాజమాన్యాలు సర్టిఫికెట్ మరియు హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం సమయం లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం వస్తుందని ప్రగాఢ బాలు పలికిన కేసీఆర్ 10 సంవత్సరాలు గడుస్తున్న ఊరికి ఒక ఉద్యోగం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మా మనుమడు ఎలాంటి భోజనం చేస్తారో అలాంటి భోజనం సంక్షేమ హాస్టల్స్ లో ఏర్పాటు చేస్తానని చెప్పిన కేసీఆర్. పెరిగిన నిత్యవసర వస్తువులకు అనుగుణంగా మిస్ చార్జీలు చెల్లించక పోవడంతో నాసిరక భోజనం సేవిస్తూ విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు - సంక్షేమ కాలేజ్ హాస్టల్లో కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో పాటు చాలిచాలని అద్దభవనాలలో ఇరుకు గదిలలో ఐదుగురు ఉండాల్సిన చోట 30 నుండి 35 మంది విద్యార్థులను గొర్రెల మందలాగా, బర్రెలమందల్లాగా ఉంచుతున్నారు. రాష్ట్రం ఏర్పాట తర్వాత ప్రైవేటు విద్యాసంస్థలను పెంచి పోషిస్తున్నది. కనీసం ఈ రాష్ట్రంలో విద్య హక్కు చట్టం అమలవుతుందా? ఈ రాష్ట్రంలో 80 శాతం పైగా విద్యా సంస్థలు అధికార పార్టీ నాయకులవే. ప్రైవేటు యూనివర్సిటీ పేర్లతో రిజర్వేషన్లు తొలగించి రకరకాల కోర్సులు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను నిలుదోపిడి చేస్తున్నాయి.

# కర్ణాటక ఫలితాలే తెలంగాణలోనూ రిపీట్

**-సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల**

**-ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తాం.. రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);: కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రిపీట్ అవుతాయన్నారు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి. శుక్రవారం ఆయన కత్రియ హోటల్ వద్ద మీడియాతో మాటాడుతూ సెప్టెంబర్ 17న మేనిఫెస్టో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభయ హస్తం పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తామని పేర్కొన్నారు.. పలు పార్టీల నేతలతో అధిష్టానం చర్చలు జరిపిందని, ప్రజలు కోరుకుంటున్న విధంగానే చేరికలు ఉంటాయని, సీఎం కేసీఆర్‌కు తన పేరు తీసే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దమ్మంటే తన పేరు తీయాలని ముఖ్యమంత్రికి సవాలు విసురుతున్నానన్నారు. తన భూమి వివరాల కోసం చాలా రోజుల నుంచి రంగారెడ్డి కలెక్టర్ దగ్గరకి తిరుగుతున్నానని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించడానికి సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చుకున్నారని విమర్శించారు. భూస్వాములను తరిమి కొట్టడానికే నక్సల్బరీ ఉద్యమం వచ్చిందని, ధరణిలో పోర్టల్ ప్రభుత్వం చేతిలో లేదని, దళారుల చేతిలోకి పోయిందని అన్నారు. ధరణి లేకపోతే రైతుబంధు రాదనడం బర్రతక్కువ పని అని మండిపడ్డారు. ధరణి మోసాల వల్ల కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకి వెళ్తుందన్నారు. చర్లపల్లి జైలులో కేసీఆర్ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామన్నారు. బావ బామ్మర్దులు (కేటీఆర్, హరీష్ రావు) వస్తే బహిరంగంగా చర్చిద్దామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలోనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెండు వేల రూపాయలకు రెండు ఫుట్ బాటిల్స్ కూడా రావడం లేదన్నారు. తండ్రి కొడుకులు నిప్పుతొక్కిన కోతుల్లా ఎగురుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబంలా ప్రజలను దోచుకోమని స్పష్టం చేశారు. సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపంపై ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వేయిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



ఆదిలాబాద్, జూన్ 9: తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నో సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయని, ఆసరా పింఛన్ పథకం ద్వారా దేశంలో ఎక్కడ లేని విధంగా అత్యధిక పింఛన్లు ఇచ్చిన రాష్ట్రం మన తెలంగాణ అని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. కుంటాల మండల కేంద్రంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా తెలంగాణ ఆడబిడ్డలకు ఒక లక్ష 16 రూపాయిలు ఇస్తూ ఒక మేనమామ కట్నం లాగా మన గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రతి ఒక్క కుటుంబంలో ఏదో ఒక రూపంలో మన కేసీఆర్ ఇచ్చే సంక్షేమ పథకం ఉంటుందన్నారు. కేసీఆర్ కిట్ ద్వారా ఆడపిల్ల పుడితే 13 వేయిలు, మగ పిల్లవాడు పుడితే 12 వేయిల రూపాయిలను అందిస్తున్న ఏకైక రాష్ట్ర తెలంగాణ అన్నారు.

గురుకులాలు ఎన్నో నిర్మించి ప్రతి విద్యార్థి పైన సుమారు ఒక లక్ష 30 వేయిల రూపాయిలు ఖర్చు చేస్తూ వారికి నాణ్యమైన విద్యను అందిస్తున్నాం అన్నారు.

ఈ కార్యక్రమంలో భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేష్ బాబు, భైంసా జడ్పీటీసీ సోలంకి దీప భీమ్ రావు, బాసర జడ్పీటీసీ వసంత రమేష్, కుంటాల జడ్పీటీసీ గంగామణి బుచ్చన్న, ముధోల్ జడ్పీటీసీ సురేందర్ రెడ్డి, లోకేశ్వరం ఎంపీపీ లలిత భోజన్న, భైంసా ఏఎంసీ వైస్ చైర్మన్ జేకే పటేల్ కుబీర్, మాజీ జడ్పీటీసీ శంకర్ చౌహాన్, భైంసా మండల కో ఆప్షన్ సభ్యులు గజనాన్, తానూర్ మండల కన్వీనర్ పోతారెడ్డి భైంసా మండల బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు ఫరూక్ అహ్మద్ పాల్గొన్నారు.

# వైఎస్సార్ పైనుంచి వచ్చి ప్రచారం చేసినా గుడివాడ గొట్టంగాడు గెలవలేదు

## -కేశినేని వ్యాఖ్యలపై బుద్దా వెంకన్న ఫైర్

అమరావతి జూన్ 9 (ఎక్స్ప్రెస్ న్యూ స్);: వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు అంశం ఇవాళ సుప్రీంకోర్టులో ఉ న్నందుకే ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి అర్ధాంతరంగా గుడివాడ పర్యటన రద్దు చేసుకున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. ఈ సారి వైఎస్సార్ పైనుంచి వచ్చి ప్రచారం చేసినా గుడివాడ గొట్టంగాడు గెలవలేడన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఇది అర్ధమవటంతో ఇక గుడివాడ పర్యటన అనవసరం అనుకున్నారన్నారు.

# వైద్య కళాశాలల ఏర్పాటుతో అందుబాటులోకి అత్యాధునిక వైద్య వసతులు : జిల్లా వైద్యాధికారి కృష్ణబాబు



విజయనగరం, జూన్ 9:జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు సందర్శించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఐదు కొత్త మెడికల్ కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. ఇప్పటికే నాలుగు కళాశాలలకు అనుమతులు వచ్చాయని, మరో కళాశాలకు కూడా త్వరలో అనుమతులు వస్తాయన్నారు. ఒక్కో కళాశాలలో 150 సీట్ల వంతున ఐదు కళాశాలల్లో కలసి రాష్ట్రానికి ఈ ఏడాది కొత్తగా 150 మెడికల్ సీట్లు కేటాయింపు జరిగిందన్నారు. ఈ ఆగష్టు నుంచే ఈ కళాశాలలు ప్రారంభం కానుందన్నారు.

వచ్చే ఏడాది మరో మూడు కళాశాలలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఒక్కో కళాశాలలో 722 మంది అధ్యాపకులు, సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. జూలై 15వ తేదీ నాటికి వైద్య కళాశాల భవనాలు సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం, వైద్య కళాశాలకు అవసరమైన విద్యుత్ సరఫరా, నీటి సరఫరా వంటి అంశాలను సమీక్షించామన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. పర్యటనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, వైద్య ఆరోగ్య మౌళిక సదుపాయాల సంస్థ ఎండి మురళీధర్ రెడ్డి, వైద్య విద్య డైరెక్టర్ వర ప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

# కుల-చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి ఆర్థికంగా చేయూత:కలెక్టర్ వీ.పీ గౌతమ్



ఖమ్మం, జూన్ 8: (నేటినిజం ప్రతినిధి): కుల, చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నందించి బలోపేతం చేస్తుందని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంక్షేమ సంబురాల్లో శుక్రవారం వైరా నియోజకవర్గంలో ఎన్.వి.ఎస్ గార్డెన్స్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనసభ్యులు రాములు నాయక్తో కలిసి లబ్ధిదారులకు రూ.1 లక్ష చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందించడం జరుగుతుందని తెలిపారు. వెనుకబడిన తరగతులకు చెందిన కుల, చేత వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి ఒక్కరూ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీ పరిధిలోని మీ సేవా కేంద్రాల్లో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు నేటి నుండి జూన్'20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు చేయాల్సింది ఒక్కటేనని కుల ధృవీకరణ పత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము సమర్పించాల్సి ఉంటుందన్నారు. సర్టిఫికేట్లు లేని వారికొరకు ప్రత్యేకంగా తహశీల్దారు కార్యాలయాల్లో ఈ నెల 12 న స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్టిఫికేట్లు అందించి అక్కడే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు తెలియజేసి వారితో దరఖాస్తు ఆన్లైన్ చేయించాలన్నారు. దీనితోపాటు ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రయివేటు స్థలాలను కొనుగోలు చేసిన భూమిని ఇళ్ళు లేని పేదలకు పంపిణీ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నేటి నుండి పంపిణీ చేయాల్సిందిగా ఆదేశాల మేరకు నేడు 100 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 58 ఎకరాలను 2 వేల మందికి ఇళ్ళ పట్టాలు అందించడం జరుగుతుందన్నారు.

గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న గొల్ల, కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను మొదటి విడతలో 16 వేల మంది గొల్ల కురుమలకు గొర్రెలను అందించడం జరిగిందన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మరో 16 వేల మంది లబ్ధిదారులకు గొర్రెల లభ్యతను బట్టి వచ్చే మూడు నెలల్లో గొర్రెలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నేడు 10 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం పేదలందరిని ఆర్థికంగా బలోపేతం చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నదని ఆయన తెలిపారు. శాసనసభ్యులు లావుడ్యా రాములు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి అవసరమైన పథకాలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ దిశగా సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆడపిల్ల పెండ్లికి ఆర్థి సహాయంతో కళ్యాణలక్ష్మి, అనారోగ్యంకు గురైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆసరా పింఛన్లు, ఇంటి స్థలాలు పంపిణీ ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు కుల, చేతి వృత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వెనుకబడిన తరగతుల వారికి లక్ష రూపాయల ఆర్థిక చేయూతనందించి ఆసరాగా నిలుస్తున్నారని శాసనసభ్యులు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, మండలం స్పెషల్ ఆఫీసర్ జె.సత్యనారాయణ, బి సి వెల్ఫేర్ అధికారి జ్యోతి, తహసీల్దార్ అరుణ, ఎంపిడిఓ. శ్రీదేవి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కొణిజర్ల తహసీల్దార్ సైదులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ఎంపిటీసిలు, కౌన్సిలర్లు, రెవెన్యూ, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మంగళగిరి కార్యాలయంలో.. పవన్ కల్యాణ్ హోమం

అమరావతి, జూన్ 9:ఈ నెల 13న మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో హోమం నిర్వహించనున్నారట జనసేన అధినేత పవన్ కల్యాణ్. హోమానికి సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఏర్పాట్లను పార్టీ నేతలు దగ్గరుండి చూసుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా మరోవైపు వారాహి యాత్రకు సంబంధించి పోస్టర్ ను జనసేన సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లా నుంచి పవన్ యాత్ర ప్రారంభం కానుంది. అన్నవరం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం పిఠాపురం, ప్రత్తిపాడు, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం నియోజక వర్గాల్లో యాత్ర కొనసాగుతుంది. అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలోకి యాత్ర ప్రవేశిస్తుంది. కాగా ఏపీలో అప్పుడే ఎన్నికల వేడి రాజుకుంది. అన్ని పార్టీలు ఎన్నికలపై ఫుల్ ఫోకస్ పెట్టాయి. జనసేనాని పవన్ కల్యాణ్ కూడా ఈ నెల 14 నుంచి వారాహి యాత్రను చేపట్టబోతున్నారు. తన ప్రచార రథంతో రాష్ట్రమంతా చుట్టేయనున్నారు. అయితే, తన యాత్రకు దైవబలం కూడా తోడయ్యేందుకు హోమం నిర్వహించాలని ఆయన నిర్ణయించారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించడమే సీఎం కేసీఆర్ ధ్యేయం- రామగుండం ఎమ్మెల్యే చందర్



పెద్దపల్లి, జూన్,9: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించే విధంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్టీసీ సంస్థ ముందుకు అడుగులు వేస్తుందని రామగుండం ఎమ్మెల్యే చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని డిపో ఆవరణలో విలేజ్ బస్ ఆఫీసర్లకు కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా వ్యవస్థ బాగున్నప్పుడే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇందుకు అనుగుణంగానే ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించే దిశగా సీఎం కేసీఆర్ నేతత్వంలో ఆర్టీసీ ప్రణాళిక బద్ధ చర్యలను అమలు చేస్తుందన్నారు. గతంలో ఆర్టీసీ మూతపడే పరిస్థితి వచ్చిందని, ప్రస్తుతం ప్రజలకు ఆమోదయోగ్య సౌకర్యాలను కల్పించే స్థాయికి చేరడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఆర్టిసి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వీబిఓ కార్యక్రమంతో ప్రజల ముంగిట్లోకి ఆర్టీసీ సేవలు చేరుతాయని అన్నారు. అంతే కాకుండా ఆర్టీసీ అధికారులకు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు సమన్వయం ఏర్పడుతుందని తెలిపారు. ఇటువంటి సేవలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి రావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా విబిఓలకు కిట్లను పంపిణీ చేయగా, ఆర్టీసీ సిబ్బంది ఎమ్మెల్యే ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లేశం, నాయకులు కాల్వ శ్రీనివాస్, పీచరా శ్రీనివాస్, అచ్చ వేణు, వంగవీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు 12 మెడికల్ కళాశాలలు మంజూరు...

హైదరాబాద్, జూన్ 9:దేశంలో ఈ విద్యా సంవత్సరం (2023-24) నుంచి కొత్తగా 50 వైద్య కళాశాలల ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో 17 కళాశాలలు తెలుగు రాష్ట్రాల్లోనివే ఉండడం గమనార్హం. ఇందులో తెలంగాణ మెజారిటీ వాటా దక్కించుకుంది. తెలంగాణలో రాష్ట్రంలో కొత్తగా 12 మెడికల్ కాలేజీలు ప్రారంభం కానుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

తెలంగాణలో మేడ్చల్, వరంగల్, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, అసిఫాబాద్, నిర్మల్, సిరిసిల్ల, వికారాబాద్, చహదరాబాద్, జనగాంలలో నూతన మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి సమీప బంధువులకు చెందిన అరుంధతి ట్రస్ట్, మేడ్చల్లో సి?ఎంఆర్ ట్రస్ట్లకు కేంద్రం అనుమతులిచ్చింది. వరంగల్లో ఫాదర్ కొలంబో ట్రస్ట్కు వైద్య కళాశాలకు అనుమతి రాగా శాసనమండలి సభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన నీలిమా ట్రస్ట్కు ఘట్కేసర్లో కళాశాల ప్రారంభానికి అనుమతి లభించింది. మిగిలిన తొమ్మిది కళాశాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి.

కరీంనగర్లో ప్రభుత్వ కళాశాలకు అనుమతి లభించినట్టు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. దీంతో ఒక్కో కళాశాలలో 100 సీట్లకు అనుమతి రాగా ఈ సంవత్సరం తెలంగాణాలో అదనంగా 1200 సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

ఆంధ్రప్రదేశ్లో

ఏపీలోని ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, రాజమహేంద్రవరం, విజయనగరం జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు కానున్నాయి. ఈ ఐదు వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటుకు ఆమోదం లభించింది. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఒక్కో కాలేజీలో 150 సీట్లతో ప్రారంభం కానున్నట్లు కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

# బీసీ నేతలతో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ

అమరావతి, జూన్ 9:వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ బీసీ విభాగం నేతలతో సమావేశమయ్యారు. ఈరోజు తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ అనుబంధ విభాగాల ఇంఛార్జి వి.విజయసాయి రెడ్డి బీసీ నేతలతో సమావేశమయ్యారు. వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, శాసనమండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ విభాగ రాష్ట్ర జోనల్ ఇంఛార్జిలు, జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ స్థాయిల్లో బీసీ విభాగ కమిటీల నియామకంపై సమీక్షించారు. విభాగ తదుపరి కార్యాచరణపై విజయసాయిరెడ్డి దిశానిర్దేశం చేశారు.

# భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ను కొట్టివేసిన సీబీఐ కోర్టు

హైదరాబాద్ జూన్ 9(ఎక్స్ ప్రెస్ న్యూ స్); : వైఎస్ వివేకా హత్య కేసులో భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ను సీబీఐ కోర్టు కొట్టివేసింది. సునీత, సీబీఐ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. కేసులో మెరిట్స్ ఆధారంగా న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉండటంతో బెయిల్ మంజూరు చేయలేమని న్యాయస్థానం భాస్కర్ రెడ్డి తరపు న్యాయవాదికి స్పష్టం చేసింది.

వివేకా హత్యకు జరిగిన కుట్రలో భాస్కర్ రెడ్డి పాత్ర కీలకంగా ఉందని సీబీఐ వాదనలు వినిపించింది. భాస్కర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తే జరిగే పరిణామాలను కోర్టుకు సీబీఐ తరపు న్యాయవాది స్పష్టంగా వివరించారు. సీబీఐ, సునీత వాదనల్లో మెరిట్స్ ఉండడంతో భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ను న్యాయస్థానం కొట్టివేసింది. వివేకా హత్య కేసులో ఎంపి అవినాశ్రెడ్డి నిందితుడేనని సీబీఐ తొలిసారి వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఏ-7గా ఉన్న భాస్కర్రెడ్డి సీబీఐ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ను వ్యతిరేకిస్తూ సీబీఐ దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్లో ఈ విషయం స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఆయన్ను సహనిందితుడిగా పేర్కొన్న దర్యాప్తు సంస్థ.. ఈ కౌంటర్లో మాత్రం ఏ-8గా పేర్కొంది. సాంకేతికంగా ఆయన్ను అరెస్టు చేసిన తర్వాతే ఏ-8గా చూపినట్లు సమాచారం.

మరోవైపు.. భాస్కర్రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ను సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. దానిని కొట్టేయాలని కోర్టును అభ్యర్థించింది. వివేకా హత్యకు సంబంధించిన కుట్ర, ఆధారాల చెరిపివేతలో తండ్రీకొడుకులు కీలక పాత్ర పోషించారని అఫిడవిట్లో తెలిపింది. 'భాస్కర్రెడ్డి అరెస్టయినప్పుడు ఆయన అనుచరులు చేసిన ధర్నాలు, నిరసన కార్యక్రమాలను బట్టి.. వారు ఎంత బలవంతులో, సాక్షులను ఎలా భయభ్రాంతులకు గురిచేయగలరో అర్థం చేసుకోవచ్చు. విస్తృత కుట్ర, ఆధారాల చెరిపివేత వంటి అంశాలపై కీలక దర్యాప్తు జరుగుతున్న ప్రస్తుత దశలో ఆయనకు బెయిల్ ఇస్తే ప్రాసిక్యూషన్ కేసు దెబ్బతింటుంది. బెయిల్ దశలోనే సాక్ష్యాధారాలను లోతుగా పరిశీలించరాదు. అలా చేస్తే దర్యాప్తులో ఇబ్బందులు తలెత్తుతాయి' అని సీబీఐ స్పష్టం చేసింది. శుక్రవారం రోజు సీబీఐ, సునీత తరపు వాదనలు విన్న న్యాయస్థానం భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ను కొట్టివేసింది.

# చెట్టుకు ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి, జూన్ 9: దామినేటి సమీపంలో చెరువు కట్ట దగ్గర శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (55) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి తిరుచానూరు ఎస్సై టీవీ సుబ్బయ్య పరిశీలించి అతని దగ్గర ఎటువంటి అడ్రస్ లేదని తెలిపారు. వివరాలు తెలిసిన వాళ్లు ఈ నెంబర్లకు సీఐ నెంబర్ 9440796755, ఎస్ఐ నెంబర్ 9347949532 సమాచారం అందించాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు తెలియజేశారు.






# రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బి.సి. కులవృతులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం

మెదక్, జూన్ 9:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మెదక్, నర్సాపూర్ నియోజక వర్గ స్థాయిలో జరిగిన సంక్షేమ సంబురాల సభలలో ఆయా శాసనసభ్యులు పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డి లో బి.సి. కులవృతులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, రెండవ విడత గొర్రెల పంపిణి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కాగా 18 నుండి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, గ్రామీణ ప్రాంతాలలో ఒక లక్ష 50 వేలు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల లోపు వార్షికాదాయం కలిగిన వారు బి.సి. కుల వృత్తులకు ఇచ్చే ఆర్థిక సహాయం పొందుటకు అర్హులు. జిల్లాలోని అర్హులైన ప్రతి బి.సి. వృతి పనివారలు ఈ ఆర్థిక సహాయం పొందుటకు అర్హులు. అయితే ఈ ఆర్థిక సహాయం కుటుంబం లోని ఒకరికి మాత్రమే వర్తిస్తుంది. గత ఐదు సంవత్సరాల లోపు ఏ ప్రభుత్వ శాఖ ద్వారా అయినా ఆర్థిక లబ్ధి పొందినా, 2017-18 లో 50 వేల లబ్ధిపొందిన ఇట్టి ఆర్థిక సహాయానికి అనర్హులు. ఇందుకోసం ఈ నెల 20 వరకు జిల్లా యంత్రాంగం దరఖాస్తులు ఆహ్వానించింది. శుక్రవారం లాంఛనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో మెదక్ నియోజక వరం నుండి 20 మందికి, నర్సాపూర్ నియోజక వర్గం నుండి 14 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యేలు చెక్కులు అందజేశారు. అదేవిధంగా గొల్ల కురుమల ఆర్థిక బలోపేతానికి జిల్లాలో మొదటి విడతగా గొర్రెల అభివృద్ధి పథకం క్రింద 12,997 మంది లబ్దిదారులకు ఒక లక్ష 25 వేల విలువల యూనిట్ లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ను 25 శాతం సబ్సిడీ పై అందించగా నేడు రెండవ విడత గొర్రెల పంపిణి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి మెదక్ నియోజక వర్గంలో 24 మందికి, నర్సాపూర్ నియోజకవరంలో 44 మందికి మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఈ రెండవ విడతలో యూనిట్ ధర ఒక లక్ష 75 వేలు కాగా 25 శాతం అనగా 43,750 లబ్దిదారుడు తన వాటాగా చెల్లించవలసి ఉంటుంది. అంతేగాక సంక్షేమ సంబురాల సందర్భంగా పొజిషన్ చూపి పట్టాలు ఇవ్వని, పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపని వాటికి లే అవుట్, ప్లాటింగ్ చేసి 201 లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను కూడా ఈ సభలో ఎమ్మెల్యేలు పంపిణి చేశారు. ఇందులో మెదక్ నియోజక వర్గం లోని మెదక్ మండలం పెరూర్ లో 50, హవేళిఘనాపూర్ లో 16, నిజాంపేట మండలం రాంపూర్ లో 16 మంది లబ్దిదారులున్నారు. ఇక నర్సాపూర్ నియోజక వర్గం ఎల్దుర్తి మండలంలోని నెల్లూరు, అస్తల్ పూర్ , ఏదులపల్లి లో 85 మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు.

# తెలంగాణ రాష్ట్రం అంటే సంక్షేమ అభివృద్ధి కార్యాక్రమాలకు గుమ్మం వంటిది : కలెక్టర్ గౌతమ్




ఖమ్మం, జూన్ 8: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం అంటే సంక్షేమ అభివృద్ధి కార్యాక్రమాలకు గుమ్మం వంటిదని, తెలంగాణ రాష్ట్రం ఆచరిస్తుంది. దేశం అనుసరిస్తుందని, పేద నిరుపేదల అవసరాలు, ఆవశ్యకతను ముందుగానే ఆలోచన చేసి వారి అవసరాలకనుగుణంగా ప్రణాళికబద్ధంగా కార్యక్రమాలను రూపొందించి అన్ని సామాజిక వర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థిక చేయూత నందిస్తున్నారని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంక్షేమ సంబురాల్లో మధిర నియోజకవర్గంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజుతో కలిసి వెనుకబడిన తరగతుల కుల,చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం రూ.1 లక్ష చెక్కులను 100 మంది లబ్ధిదారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఆడపిల్ల పెండ్లి చేయాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేదని, అంతేకాకుండా బాల్య వివాహాలను చేసే వారని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కళ్యాణలక్ష్మీ/ షాదిముబారక్ పథకం లబ్ధి 1 లక్షా 116 రూపాయలు ఆర్థిక చేయూతనందించే కార్యక్రమంతో బాల్య వివాహాలను నిరోధించగలిగామని, తల్లిదండ్రుల్లో ఆలోచన పెరిగిందని, పథకం లబ్ధి చేకూరలంటే అమ్మాయికి 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాతనే పెండ్లి చేయాలని ఆలోచిస్తున్నారని కలెక్టర్ అన్నారు. ఈరోజే 125మంది లబ్ధిదారులకు 12514500 విలువ గల చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. మధిర నియోజకవర్గ పరిధిలో 9 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. వయోవృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బోదకాలు వ్యాధి బాధితులకు జిల్లాలో ప్రతి నెలా ఆసరా పింఛన్ల క్రింద 40 కోట్ల రూపాయలను చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తూ కొత్త పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొద్ది వ్యవధిలోనే ప్రభుత్వ స్థలాలను గుర్తించి పేద ప్రజలకు ఇంటి స్థలాలను అందించాలనే సంకల్పంతో ఈ రోజున వందల సంఖ్యలో పట్టాలు అందించడం జరుగుతుందన్నారు. వెనుకబడిన తరగతుల చేతివృత్తిపై ఆధార పడి ఉన్నారో వారికి ఆర్థిక చేయూతనందించడంతో అట్టి పెట్టుబడి సాయంతో వారు తమ వృత్తిలో నైపుణ్యతతో ఉత్పత్తి సామర్థ్యం పెంపొందించుకొని ఎక్కువ లాభాన్ని అర్జించడం జరుగుతుందనే ఉద్దేశ్యంతో రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వెనుకబడిన తరగతుల చేతివృత్తులపై ఆధార పడిన ప్రతి కుటుంబానికి పథకం లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడు మీ సేవా కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధంగా ప్రజాప్రతినిధులు చొరవచూపాలన్నారు. జూన్‘20 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రజకులు వాషింగ్ మెషన్‌లు, డ్రై, ఇస్త్రీ పరికరాలకు, నాయిబ్రాహ్మణలకు మంచి సెలూన్ షాపు, ఎలక్ట్రానిక్ పరికరాలు సమకూర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎవ్వరూ ఊహించని విధంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి వాటిని విజయవంతంగా అమలు చేయడం జరుగుతందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను 21 రోజుల పాటు రూపకల్పన చేసి ప్రతిరోజు ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని 9 సంవత్సరాలు సాధించిన ప్రగతిని ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సంక్షేమ సంబురాల్లో భాగంగా పేదలకు లబ్ధి చేకూర్చే విధంగా ఇంటి స్థలాలు, కళ్యాణలక్ష్మీ/షాదిముబారక్ చెక్కులు, కుల, చేతివృత్తిదారులకు ఆర్థిక సహాయం, ఆసరా పింఛన్లు అన్ని సామాజిక వర్గాలకు ఆర్థిక చేయూత నందించి వారి పురోభివృద్ధికి దోహదపడుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోకలత, కమిషనర్ రమాదేవి, మధిర నియోజక తహశీల్దార్లు, ఎంపిడిఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు. ఎంపిటిసిలు, జడ్పీటిసిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు, లారీ మధ్య ఇరుక్కున్న స్కూటీ.. విద్యార్థినులకు తృటిలో తప్పిన ప్రమాదం

తిరువనంతపురం, జూన్ 9: ఇద్దరు విద్యార్థినులు ప్రయాణించిన స్కూటీ ప్రైవేట్ బస్సు, లారీ మధ్య ఇరుక్కుంది. అయితే వారిద్దరూ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది . కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం ఇద్దరు యువతులు మావూరు నగరంలోని ఇరుకైన రోడ్డులో స్కూటీపై వెళ్తున్నారు. అయితే స్కూటీ డ్రైవ్ చేస్తున్న యువతి, ముందు వెళున్న ప్రైవేట్ బస్సును ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించింది. ఇంతలో ఒక లారీ ఎదురుగా వచ్చింది. దీంతో బస్సు, లారీ మధ్య స్కూటి ఇరుక్కుపోయింది. అయితే అదృష్టవశాత్తూ స్కూటీపై ఉన్న ఇద్దరు యువతులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు.కాగా, ఈ సంఘటనతో స్కూటీతో సహా ఇద్దరు యువతులు రోడ్డుపై పడ్డారు. వారు ధరించిన హెల్మెట్లు కూడా రోడ్డుపై దొర్లాయి. అనంతరం బస్సు డ్రైవర్‌పై వారు అరిచారు. బస్సులోని ప్రయాణికులు కూడా కిటికీ నుంచి ఈ సంఘటనను చూశారు. మరోవైపు ఆ ప్రైవేట్ బస్సుకు ఏర్పాటు చేసిన సీసీటీవీలో ఈ సంఘటన రికార్డు అయ్యింది. దీంతో ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# కూల్చిన ఇండ్ల స్థలంలోనే ఇండ్లు కట్టివ్వాలి..పేద ముస్లింలకు న్యాయం జరిగేంత వరకు ఎంఐఎం అండగా ఉంటుంది

## –ఇండ్లను కూల్చిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకు ఎందుకు కేసు నమోదు చేయలేదు

### –రాష్ట్ర ప్రభుత్వానికి నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ సూటి ప్రశ్న



కరీంనగర్, జూన్ 9: (నేటినిజం ప్రతినిధి): ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ నియోజకవర్గంలో ఇటీవలే పేద ముస్లింల ఇండ్లను కూల్చిన సంఘటనలో రేకుర్తి జరీనా నగర్, మొహసీన నగర్ లో క్షేత్ర స్థాయిలో పర్యటించి కూల్చిన ఇండ్లను పరిశీలించి, పేద ముస్లింలతో మాట్లాడి పూర్తిస్థాయిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ .గత 25 సంవత్సరాల క్రితం తమకు కరీంనగర్ భూస్వామి అయిన షేక్ ఖాన్ వారసుడు షేక్ సాలెహ్ తల 60 గజాల భూమిని పేద ముస్లింలమైన తమకు తమతో పాటు ఎస్సీలు బీసీలు సిక్కులకు కుల మత వర్గ విభేదాలకు తారతమ్యం లేకుండా భూములు ఇచ్చారని 20 ఏళ్ల సంధి లేని ఇబ్బంది ఈ భూమిపై ఇప్పుడే భూ బకాసురులది ఎందుకు పడిందని దీన్ని కబ్జా చేసి ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని ప్రభుత్వ పెద్దల సహకారంతో రెవెన్యూ అధికారుల పోలీసుల మద్దతుతో తమ ఇండ్లను కూలగొట్టి దాష్టికం చేశారన్నారు అప్పు సప్పు చేసి కూలి పనులు చేసుకుని బ్రతికే తాము ఇల్లు కట్టుకుంటే తమ ఇండ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తులు తాము మంత్రి గంగుల కమలాకర్ కు సంబంధించిన వ్యక్తులమని ఓ రెవెన్యూ అధికారి ఇద్దరు పోలీసు సిబ్బంది ని అక్కడ పెట్టి నెంబర్ ప్లేట్ లేని ఫార్చునర్ కారులో వచ్చి పట్టపగలు మిట్ట మధ్యాహ్నం తమను భయభ్రాంతులకు గురిచేసి సెలవు రోజైన రెండవ శనివారం రోజు వచ్చి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అన్యాయంగా తమ ఇండ్లను కూల్చివేశారని కన్నీరు అయ్యారు ఇంత జరుగుతున్న స్థానిక మంత్రి తమకు ఎమ్మెల్యే అయి ఉండి ముస్లింల ఓట్లతో గెలిచి పట్టించుకున్న పాపాన పోలేదని రేకుర్తి లక్ష్మీనరసింహస్వామి గుట్టకు పదుల సార్లు వచ్చిపోయే మంత్రి గంగుల కమలాకర్ ఇంత జరుగుతున్నప్పటికీ ఒక్కరోజు వచ్చి పరామర్శించిన పాపాన పోలేదని వాపోయారు ఇండ్లను కూల్చిన స్థలంలో తమకు డబుల్ బెడ్ రూమ్ లు కట్టి ఇవ్వాలని తమ ప్రాణాలు పోయిన ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు తమకు ఏదైనా జరిగితే మంత్రి గంగుల కమలాకర్ ది, రియల్ ఎస్టేట్ మాఫీయాదే బాధ్యత అన్నారు. తమ కాలనీ అభివృద్ధి అయితే ఇక్కడే నివాసం ఉంటామని పసిగట్టిన రియల్ ఎస్టేట్ మాఫియా మున్సిపల్ కార్పొరేషన్ లో రేకుర్తి విలీనమైన తర్వాత ఇక్కడి భూములకు లక్షలాది రూపాయల విలువ వచ్చిన నేపథ్యంలో సరేనా నగర్ మోసినా నగర్ లో రోడ్లు త్రాగునీరు కరెంట్ వసతి కల్పించకుండా అభివృద్ధి చేయకుండా నివాసయోగ్యంగా ఉండకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు

ఈ విషయాన్ని తాను తమ అధినేత హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకెళ్తానని ఈరోజు జిల్లా కలెక్టర్ ను కలిసి విన్నవిస్తానన్నారుఈకార్యక్రమంలో ఎంఐఎం నగరఅధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, కోశాధికారి ఇబ్రహీం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖీల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలిబాబా, అజర్ దబీర్, కాజమ్ అలీఖాన్, సాజిద్, యాఖూబ్, ఖాలీద్, అహ్మద్ ఖాన్, బిలాల్, ఇమ్రాన్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ దేశానికి ఆదర్శం

## –వచ్చే పదేళ్లకు అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తాం

### – రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్ పల్లి వినోద్ కుమార్

రాజన్న సిరిసిల్ల, జూన్ 9:(నేటినిజం ప్రతినిధి): దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా బలమైన రాష్ట్రమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉ




పాధ్యక్షులు బోయిన్ పల్లి వినోద్ కుమార్ అన్నారు.తెచ్చిన అప్పుకు అనేక రేట్ల సంపదను ప్రభుత్వం సృష్టిస్తున్నందునే అప్పులు ఇచ్చేందుకు సంస్థలు, బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఆయన అన్నారు.పతారా ఉంది కాబట్టే అప్పు పుట్టిందన్న విషయాన్ని విమర్శకులుగుర్తుం చుకోవాలని ఆయన హితవు పలికారు.శుక్రవారం వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో స్థానిక శాసన సభ్యులు చెన్నమనేని రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన సంక్షేమ సంబరాలు కార్యక్రమానికి బోయినిపల్లి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా ఫంక్షన్ హాల్ లో కిక్కిరిసిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అప్పులు తెచ్చిందని కొంతమంది అవాకలు చివాకులు పేలుతున్నారని అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెచ్చిన అప్పులను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి ,గోదావరి ,కృష్ణ నది జలాలను ఎత్తిపోసేందుకు , ప్రాజెక్టుల నిర్మాణానికి మాత్రమే వెచ్చించామని ఆయన తెలిపారు.

ఫలితంగా తెలంగాణలో సంపద సృష్టి అనేక రేట్లు పెరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే సానుకూల ఫలితాలను ప్రజలు అనుభవిస్తున్నారని అన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు కరువంటే తెల్వదని ఆయన వ్యాఖ్యానిం చారు. దశాబ్ది ఉత్సవాలపై మీ అభిప్రాయం ఏంటని ఓ జర్నలిస్టు ప్రశ్నించాడు. అన్న ఆయన దశాబ్ది ఉత్సవాలను గర్వంగా జరుపుకుంటున్నామని తాను సమాధానమిచ్చానని తెలిపారు. ఈ దశాబ్ది ఉత్సవాల సమయంలోనే వచ్చే పదేళ్లకు సమాలోచనలు చేస్తామని , ప్రణాళికలు రూపొందించుకుంటామని ఆయన అన్నారు. వచ్చే పదేళ్లలో పుష్కలంగా పైసలు ప్రభుత్వం వద్ద ఉంటాయని పేద ప్రజల సంక్షేమానికి ఆ పైసలు వెచ్చిస్తామని ఆయన తెలిపారు. సమైక్య రాష్ట్రంలో కేవలం 3 ప్రభుత్వ వైద్య కళాశాల లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్లలో ఒక్కో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కళాశాలతో పాటు ఒక్కో జిల్లాలో 500 పడకల ఆసుపత్రి నిర్మాణం కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలోనే కేసిఆర్ దళిత బంధుకు ఆలోచన చేశారని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ సంబురాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. గతంలో లాగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములు భూస్వాముల చేతుల్లో లేవని బీసీలు, ఎస్సీలు ,ఎస్టీలు, సన్న ,చిన్న కారు చేతుల్లోకి వచ్చిందని బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. సీలింగ్ చట్టాలు, సామాజిక ఉద్యమాలు ద్వారా సన్న, చిన్న కారు రైతుల్లో ఈరోజు భూమి ఉందన్నారు . వెనుకబడిన తరగతులకు మేలు జరగాలని సీఎం కేసీఆర్ రైతుబంధు పెట్టడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు మాట్లాడుతూ

సంక్షేమం అభివృద్ధి ఫలాలను సుపరిపాలన ద్వారా ప్రభుత్వ అందిస్తుంది అన్నారు. రైతుబంధు మాదిరే బీసీ కుల వృత్తులకు ఆర్థిక సహాయం పథకం కూడా కొనసాగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల్లోని ప్రతి పేద వ్యక్తికి అందే వరకు కుల వృత్తులకు ఆర్థిక సహాయం కొనసాగుతుందన్నారు. ఉద్యమ సారధి కేసీఆర్, కే టీ ఆర్ దార్శనికతతోనే తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. సంక్షేమ సంబరాలలో 6 మంది బీసీ లబ్ధిదారులకు బీసీ కులవృత్తులకు చేయూత పథకం ద్వారా ఒక్కొక్కరికి లక్ష రూపాయలు అందజేశారు. గొర్రెల యూనిట్ల పథకం ద్వారా 24 మందికి లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేసి రెండో విడత కార్యక్రమాన్ని నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించారు. మైనార్టీ సంక్షేమ శాఖ నుంచి ఇద్దరికీ స్కీం ల మంజూరు యూనిట్ లను అందజేశారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద నియోజకవర్గంలోని మండలానికి ఇద్దరికి చొప్పున 18 మందికి ఆర్థిక సహాయం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 6 మంది లబ్ధిదారులకు స్కీం మంజూరు ఉత్తర్వులను అందించారు.

అలాగే కొనరావుపేట ,మేడిపల్లి మండలాలు చెందిన నలుగురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ,నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు జడ్పిటిసిలు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి హమాలీ సంఘం ఆర్థిక సాయం



రాజన్న సిరిసిల్ల, జూన్ 9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన గోనెల శంకర్ 53 శుక్రవారం ఉదయం కూలి పని చేస్తుండగా వడదెబ్బతో చనిపోగా మృతుడి కుటుంబానికి హమాలీ సంఘం సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మృతుని కుటుంబానికి హమాలి సంఘం తరఫున ఆర్థిక సహాయనీగా రూ.7 250 తో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు . కుటుంబానికి అండగాఉంటామని బరోసనిచ్చారు.

# నిరాడంబరంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కుమార్తె వివాహం



న్యూఢిల్లీ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తన కుమార్తె వివాహాన్ని బెంగళూరులోని తన నివాసంలోనే చాలా నిరాడంబరంగా జరిపించారు. పెద్ద స్థాయి రాజకీయ నేతలు ఎవరూ ఈ వేడుకలో పాల్గొనలేదు. కేవలం కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.నిర్మల సీతారామన్ కుమార్తె పరకాల వాఙ్మయిని ప్రతీక్ దోషికి ఇచ్చి గురువారం వివాహం చేశారు. ఈ వివాహం ఉడుపి అదమూరు మఠం ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంప్రదాయ పద్ధతిలో, అదమూరు మఠం వైదిక విధానంలో జరిగింది. ఈ మఠం అధిపతులు వధూవరులను ఆశీర్వదించారు. వాఙ్మయి గులాబీ రంగు చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించారు. వరుడు ప్రతీక్ తెల్లని పంచె, కండువా ధరించారు. నిర్మల సీతారామన్ మొలకల్మూరు చీర ధరించారు.వరుడు ప్రతీక్ దోషి గుజరాత్‌కు చెందినవారు. సింగపూర్ మేనేజ్‌మెంట్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చాలా కీలకమైన సహచరుడు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ పని చేసిన సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పని చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయం (ఖఓా)లో 2014 నుంచి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పని చేస్తున్నారు. 2019 జూన్‌లో ఆయనకు జాయింట్ సెక్రటరీగా పదోన్నతి లభించింది.వధువు వాఙ్మయి మింట్ లాంజ్‌కు చెందిన బుక్స్ అండ్ కల్చర్ సెక్షన్‌లో ఫీచర్ రైటర్‌గా పని చేస్తున్నారు.

# నెక్సస్ హైదరాబాద్ మాల్ “గొప్ప స్నీకర్ ఫెస్టివల్ ఈ నెల 9 నుండి 16 వరకు

హైదరాబాద్, 9 జూన్ 2023: స్నీకర్లు వాటి సౌలభ్యం మరియు మన్నికకు ప్రసిద్ధి చెందాయి. హై-ఎండ్ ఫ్యాషన్ స్నీకర్ల నుండి స్పోర్టీ స్నీకర్ల వరకు దాదాపు ఎనిమిది రకాల స్నీకర్లు ఉన్నాయి. మీ సౌకర్యానికి ఫ్యాషన్‌కు సరిపోయే స్నీకర్ల జతను కనుగొనడంలో మీకు సహాయపడటానికి. నెక్సస్ హైదరాబాద్ మాల్, దాని వన్-స్టాప్ షాపింగ్ డెస్టినేషన్‌గా ప్రసిద్ధి చెందింది, ఆకట్టుకునే స్నీకర్ల సేకరణతో బోల్డ్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ చేయడానికి పెద్ద స్నీకర్ల పండుగను ఏర్పాటు చేసింది. సందర్శకులు రిలయన్స్ సెంట్రో వంటి ప్రముఖ బ్రాండ్‌లను అనుభవించవచ్చు మరియు అన్వేషించవచ్చు. మీ వార్డ్‌రోబ్‌తో వెళ్లడాన్ని కనుగొనండి.ప్రతి స్నీకర్ కొనుగోలుపై రూ. 500 వోచర్‌ను గెలుచుకునే ప్రత్యేకమైన షాప్ విన్ అష్యూర్డ్ గ్రాటిఫికేషన్ క్యాంపెయిన్‌ను ప్రదర్శించడానికి నెక్సస్ హైదరాబాద్ మాల్ ఉత్సాహంగా ఉంది. స్నీకర్స్ ఫెస్టివల్ జూన్ 9వ తేదీన ప్రారంభమవుతుంది. అద్భుతమైన ఎంపికను అన్వేషించడానికి అందుబాటులో ఉన్న అద్భుతమైన ఆఫర్‌ల ప్రయోజనాన్ని పొందడానికి మేము ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాము. మీరు స్నీకర్ ప్రియులైనా లేదా సౌకర్యవంతమైన స్టైలిష్ స్నీకర్ల కోసం ఈ పండుగను మిస్ అవ్వకూడదుఅని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# నొవోటెల్ హోటల్‌లో ప్రారంభమైన హైదరాబాద్ జ్యువెలరీ, పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) 2023

## భవిష్యత్ ఫ్యాషన్ ధోరణులతో కూడిన డిజైన్లతో పాటుగా వినూత్నమైన వజ్రాభరణాలనూ ఆవిష్కరించారు




హైదరాబాద్, జూన్ 9: భారతదేశంలో బీ2బీ ఎగ్జిబిషన్‌ల నిర్వహణలో ఖ్యాతి గడించిన ఇన్‌ఫార్మా మార్కెట్స్ , ఆభరణాల ప్రేమికులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న హైదరాబాద్ జ్యువెలరీ, పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) 15వ ఎడిషన్‌తో వచ్చింది. ఈ సంవత్సరపు ప్రదర్శనలో దాదాపు 200 మందికి పైగా అగ్రశ్రేణి ఎగ్జిబిటర్లు తమ వినూత్నమైన డిజైన్లను ప్రదర్శిస్తున్నారు. దాదాపు 8000 మంది వాణిజ్య కొనుగోలుదారులు పాల్గొన్నారు. దాదాపు 600 ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్లు ఈ ఎక్స్‌పో లో దాదాపు ఒక లక్షకు పైగా తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి .హైదరాబాద్ జ్యువెలరీ, పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) 2023 ను విశిష్ట అతిథులు, పరిశ్రమ ప్రముఖుల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణా రాష్ట్ర ఐటీ, వాణిజ్య,పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్ ; తెలంగాణా బులియన్, జెమ్ అండ్ జ్యువెలరీ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ జగ్దీష్ పెర్షాద్ వర్మ, ఐబీజెఏ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ చేతన్ మెహతా ; ఇండోనేషియన్ ట్రేడ్ ప్రొమోషన్ సెంటర్ (ఐటీపీసీ) డైరెక్టర్ శ్రీ నుగ్రోహో ప్రియో ప్రటోమో ; హెచ్‌ఐజెఎంఏ కన్వీనర్ శ్రీ ముఖేష్ అగర్వాల్, ఏఓజె డైరెక్టర్ శ్రీ సుమేష్ వధేరా ; ఎస్‌వీఏఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రాజేంద్ర జైన్ ; ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ యోగేష్ ముద్రాస్ ; ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా గ్రూప్ డైరెక్టర్ శ్రీమతి పల్లవి మెహ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిన 14 రంగాలలో జెమ్స్ అండ్ జ్యువెలరీ ఒకటన్నారు. మిగిలిన రంగాలన్నీ అద్భుతమైన ప్రగతి సాధించినప్పటికీ, జెమ్స్ అండ్ జ్యువెలరీ రంగంలో మాత్రం కోర్టు కేసులు సహా పలు కారణాల రీత్యా తాము ఆశించిన ప్రగతి సాధ్యం కాలేదన్నారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, తమ వర్క్‌షాప్‌లు, ఫ్యాక్టరీలు పెట్టే ఆభరణాల వర్తకులకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.ఇన్‌ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ యోగేష్



ముద్రాస్ మాట్లాడుతూ “ తమ తొలి ప్రయాణం హైదరాబాద్‌లోనే ప్రారంభమైంది. గత 15 సంవత్సరాలుగా ఈ ప్రదర్శనను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాము. ఈసారి ప్రదర్శనలో 200కు పైగా స్టాల్స్ ఉంటాయి. ఈ మూడు రోజుల ప్రదర్శన విజయం సాధించగలదని ఆశిస్తున్నాము”అని అన్నారు.

# ఉద్యోగి శ్రేయస్సు మానసిక భద్రత కీలక ఆందోళనలు

## జి ఐ గ్రూప్ హోల్డింగ్ ఇండియా రీసెర్చ్

హైదరాబాద్, జూన్ 9:ఆటో, బిఎస్‌ఎఫ్ఐ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసిజి, ఇ-కామర్స్ వంటి కీలక రంగాలను ఈ నివేదిక కవర్ చేస్తుంది. ఆరోగ్యం, ఐ టి రిటైల్, వివిధ పరిమాణాలలో విస్తరించి ఉన్న సంస్థలు. యొక్క అంతిమ లక్ష్యంతో స్థిరమైన సుసంపన్నమైన కార్మిక మార్కెట్‌ను పెంపొందించడంలో మానసిక క్షేమం యొక్క ప్రాముఖ్యతను గుర్తించడం ఈ అధ్యయనం పనిలో మానసిక భద్రత పరివర్తనను నిర్మించడంలో ఎలా ఉపయోగకరం అవుతుందో పరిశీలిస్తుందిఉద్యోగులు, సంస్థలు మొత్తం సమాజానికి సానుకూల పని వాతావరణం. జి 1 గ్రూప్ హోల్డింగ్ ఇండియా యొక్క తాజా పరిశోధన పని ప్రదేశాలలో మానసిక భద్రత యొక్క కీలక పాత్రను గుర్తించడం ఉద్యోగి సంతృప్తి, మానసిక ఆరోగ్యం, ఆవిష్కరణ, ప్రతిభను ఆకర్షించడం మరియు వాటిపై దాని ప్రభావాన్ని వెల్లడిస్తుంది. ధారణ. సర్వే ప్రకారం, 94% మంది ఉద్యోగులు మానసిక స్థితి యొక్క అనివార్యతను గుర్తించారు. భద్రత, 79% యజమానులు సురక్షితమైన వాతావరణాన్ని పెంపొందించడానికి ప్రాధాన్యతనిస్తున్నారు. అని అధ్యయనం నొక్కి చెబుతోంది74% మంది ఉద్యోగులు మానసికంగా అసురక్షితమైన కార్యాలయం మానసిక ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని నమ్ముతున్నారు. అయితే 57% యజమానులకు మానసిక భద్రత గురించి బాగా తెలుసు, 35% మంది ఉద్యోగులతో కూడిన మైనర్ గ్రూప్ అదే పంచుకుంటుంది. అవగాహన, పెరిగిన కమ్యూనికేషన్ మరియు విద్య అవసరాన్ని నొక్కి చెబుతుంది. యువ కార్మికులు వృద్ధులు 46 మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి 86%తో పోలిస్తే 26-45 అత్యధిక గుర్తింపును 96% వద్ద ప్రదర్శిస్తుంది. చిన్నది. మానసిక భద్రతను గుర్తించడంలో సంస్థలు (98%) ముందంజలో ఉన్నాయి, తర్వాత మధ్యస్థ పరిమాణం (95%) పెద్ద సంస్థలు (88%). మూడవ పరిశోధన నివేదికను ప్రారంభించిన సందర్భంగా, భారతదేశంలోని జి ఐ గ్రూప్ హోల్డింగ్‌లో కంట్రీ మేనేజర్ సోనాల్ అరోరా ఉనబీసీబీ;ఉద్యోగుల శ్రేయస్సుపై 2023 సంవత్సరానికి మా పరిశోధన నివేదికను ప్రారంభించడం పట్ల మేము సంతోషిస్తున్నాము మానసిక భద్రత. మన సమాజాన్ని ప్రభావితం చేసే ఈ కీలక సమస్యను హైలైట్ చేయడానికి మేము మొదట మా ప్రయత్నాలను ప్రారంభించాము. మా నివేదిక యొక్క 2021 ఎడిషన్, మనలో మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన స్థాయిని పెంచడంపై దృష్టి సారించిందిఅని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో వివరించింది.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.